# ఆనప్పాదు కథ

ఓగేటి శివరామకృష్ణ

మొక్కరాల గ్రామంలోవున్న ప్రాథమిక ఎయిడెడ్ పాఠశాలవారు మున్షీగారి సలహాప్రకారం—తమబడి తోటలో—నాలుగు రకాల మొక్కలూ, నాలుగురకాలపాదులూ పెట్టారు—'మున్షీ'జీ నోటివాక్యం చల్లదనం వల్లనో, బడితోట ప్రదేశం మంచిదవటంవల్లనో పాదులు, చెట్లు పెట్టడమే తడవుగా అవి 'గుప్పు'న పచ్చగా పువ్వుపూసి కాయలవ సాగాయి, ఇదివరకటి కన్న యిప్పుడు తోటలో పెరుగుతున్న మొక్కలు చూసి — ఉపాధ్యాయ బృందం, విద్యార్థి బృందం—తోట మంచి బాగా పెరుగుతున్నదనీ, యింత చక్కగా తోట తయారవటం తా మెప్పుడూ చూడలేదనీ' యేమేమో అంటూండేవారు.

మూడుమాసాలకాలం కాపుకాయటం ఉపాధ్యాయులకే కాక చుట్టుప్రక్కలనున్నవారికి కూడా ఆశ్చర్యం కలగించింది—ఆశ్చర్యంతోనున్నవారంతా—తీరిక దొరికినప్పుడల్లా ఉపాధ్యాయుల్ని కలుసుకోవటం, యేవేవో నాలుగు కబుర్లు చెప్పటం—ఏమయినా కాయలున్నాయండీ—ఇంట్లో కూరలేదనటం— జరిపేవారు. మొహమాటం కొద్దీ అనండి, అడిగినవాళ్ళకు లేదని చెప్పటంచేత గాక అనుకోండి—వచ్చి కోరినవాళ్ళకు మరి యెదురు చెప్పకుండా—యేవో ఒకరకం యిచ్చేస్తూండేవారుఉపాధ్యాయ బృందం—రేపటి కాయలు మనం తిందాం—అనే సంతృప్తిపడుతూ—ఈలా యెన్నో 'రేపులు గడిచాయికాని వారు యే 'రేపు'లోనూ కాయలు స్వయంగా కోసుకొని, తమ ఆహారంలో ఉపయోగించుకోలేకపోయారు.

అత్తగారి సొమ్ము అల్లుడు ధారపోసినట్లుగా యెవరికి వారే పెద్దమనుష్యుల క్రింద లెక్కవేసుకొని యేవో మాటలు చెబుతూ— చెట్టునున్న కాయలు కోసేస్తూంటే మేష్టర్లు తెల్లముఖాలు వేస్తూంటే మరో మాసం పదిహేనురోజులకాలం కాలం గడిచింది.

అంతవరకూ నిశ్శబ్దంగా నిద్రపోతున్న అనప్పాదు హటాత్తుగా—నిద్రనుంచి మేల్కొన్నట్లుగా పాకంతా ప్రాకి—ఎక్కడకక్కడే పిందెలు వేయటం ప్రారంభించింది.

అనప్పాదు పిందెలు వేయటం-చుట్టుప్రక్కల పెద్దమనుష్యులతో పాటు, పాఠశాల ఉపాధ్యాయులుగూడా కనుగొన్నారు—నిజానికి వాళ్ళు పాప, అంతవరకూ ఒక్కగా ఒక్క కాయ అయినా తిని వుండలేదు—

అనప్పాదు పిందె వేయటంతోటే ఉపాధ్యాయులంత ఊకొమ్మడిగా సమావేశమై, అనప్పాదు విషయం, కాయల విషయం చర్చించుకొన్నారు—అనప్పాదు — పాకంతా ప్రాకినందుకు తమ అభినందనాలు దానికి అర్పిస్తూ... అంత పెరిగిన పాదు అభివృద్ధికి భంగం కలిగించరాదనే తలంపుతో—ప్రతీదినం ఒక కావడినీరు చొప్పున పోయించటానికీ, దానికయ్యే ఖర్చులు, ఉపాధ్యాయబృందం అంతా కలసి యిచ్చుకొనటానికీ తీర్మానించుకొన్నారు. మరి కాసే కాయలు యిక యితరులకివ్వటం అన్యాయమని—తమ తోటలో. . తయారయే సరుకు యితరులు కోరటం భావ్యం కాదనీ...తాము పండించుకొన్నది తామే తినవలయుననే ప్రభుత్వ వాక్యం ఆచరణలో పెట్టటం చాలా అవసరం అనీ—అందువల్లా, యింతవరకూ పండిన పంటల్లో (కూరలే అనుకోండి), తామేమాత్రం

కూడా తీసుకొనివెళ్ళకపోవడంవల్ల, యిక ముందు తయారయే సరకు తామే పూర్తిగా, పూర్ణంగా జీర్ణం చేసుకోవాలనీ యింకముందు తయారయేసరుకు యితరులు అడుగకూడదనీ, అడిగినా యివ్వకూడదనీ వీరు తీర్మానించుకొన్నారు. త్వరితకాలంలో కాయకాసినందుకు- ఆనపకాయకు అభివందనా లర్పిస్తూ సభ దిగ్విజయంగా ముగించారు.

విత్తనం మంచిదవటంవల్ల ... నిగనిగలాడుతూ—పొడుగ్గా—పాకనిండుగా దిగిన లేతపిందెలు చూసే ప్రతీవాళ్ళూ లొట్టలేస్తూండేవారు. తీర్థప్రజలాగ మరి ఎన్నడూ రానివారుకూడా పాఠశాలలోనికి వచ్చి అంత శ్రద్ధగా ఆనపపాదు పెంచుతున్నందుకు . ఉపాధ్యాయబృందంవారికి కృతజ్ఞతలందచేస్తూ 'ఎప్పుడు రమ్మంటారండీ?' (ఎందుకో) అని ప్రశ్నలేస్తూండేవారు గూఢార్థంగా — గూఢంగా వున్నదానిలోని అర్థం గ్రహించిన ఉపాధ్యాయబృందం...మరి దూరపు మాటలు చెప్పక మర్యాదగా 'కబురంపుతాం గదండీ' అనేవారు.

ఈలా నాలుగయిదురోజులు గడిచీ గడవటంతోటే కాయలు ముదిరాయి—ఏం చేదామా అని ఉపాధ్యాయులు ఆలోచన చేస్తూండగానే... 'ఏమండి—ముదిరిపోతున్నాయ్ ఈ దినం కోయించి వేదాం ఏమంటారు?' అని యిద్దరు ముగ్గురు రెండుమూడుసార్లు చెప్పారు—'చూదాం లెండి' అని తప్పించుకోబోతూంటే ఉపాధ్యాయబృందం—మాటలు మరి లక్ష్యపెట్టకుండా 'నే కోస్తానుండండి' అని భక్తుల్లాగ...ఎక్కి వున్న పిందెల సహితం మొత్తం ఒక అరడజను కాయలు కోసి క్రిందపడేశారు ఆరాధులు.

'కాయలు బాగున్నాయండి—మరి యెవళ్ళకీ యివ్వకండి'...అని చెబుతూ . ఒక్కొక్కళ్ళూ ఒక్కొక్క కాయ చొప్పున నలుగురూ— నాలుగుకాయలూ (ఉన్నవాటిల్లో పాణ్యమైనవి) తీసుకొని నవ్వుకొంటూ వెళ్ళిపోయారు.

మరి మిగిలింది—ఒక ముదురు టెంక; ఒక లేత పిందె, ఉపాధ్యాయులు విస్తుపోయి ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసుకొంటూంటే.

'మా అమ్మకు పథ్యం తిండీ...ఓ ఆనపకాయ యిప్పించమందండి' అంటూ ఒక కుఱ్ఱవాడు వచ్చాడు.

'అవునండి ..నిజం...వాళ్ళయింట్లో పథ్యమేనండి' ప్రక్కనున్న మరో పెద్దమనిషి అనటంతోటే (ముదురుకాయ పథ్యానికి పనికిరాదు కాబట్టి) ఆ లేతకాయ కుఱ్ఱవాడికిచ్చి పంపించారు.

'ఈ పూట కూరలేదండి'—అన్నాడు ప్రక్కనున్న పెద్దమనిషి.

'బాగుంది' అని ఒకళ్ళవైపు ఒకళ్ళు చూసుకొన్నారు.

ఒక ఉపాధ్యాయుడు 'సరే యీ కాయ నువ్వు తీసుకొనిపో' అన్నాడు.

'ముదురుకాయాండి'—అని నసుగుతూ తీసుకొనిపోయా డతను.

ఈ విధంగా ప్రథమంలో తయారయిన కాయలు పరాయిచేతుల్లోకి వెళ్ళిపోయాయి...ఆ సమయంలో విక్రయించడానికి వచ్చిన నాల్గుకాయలూ గుత్తబేరం రూపాయబేడ చేసి పుచ్చుకొని, ఆనపకాయలు యింటికి పంపించారు పంతుళ్ళు.

కానయితే తీర్మానంప్రకారం తాము నడవనందుకు వాళ్ళల్లో వాళ్ళకు బాధ కలిగింది. ఏమిటండీ...ఈలా చేశారు' అని ఒకళ్ళనొకళ్లు దెప్పుకొన్నారు. .కొంత సంఘర్షణమీదట అహింసాసూత్రాలప్రకారం వారిని మార్పుచేసే యుద్దేశంతో ఒక యేర్పాటుచేసుకొన్నారు. ఆ యేర్పాటేమిటంటే ఎవరైనా పెద్దలు కాయకోసం వచ్చినట్టయితే వారు చెప్పేది చాలా జాగర్తగా విని 'మీ రడిగినమాట ... మీరు చెప్పినమాట నిజమేననుకోండి...కాని పాదులోని కాయ ఒక్కగా ఒక్కటికూడా మా సోదర ఉపాధ్యాయుల అంగీకారంలేకుండా

కోయడానికి వీలులేదు. మీకు అంతగా కావలెనంటే, కాయడబ్బులు నేనే యిస్తా; బజారుకు పోయి కొనుక్కోండి' ఈ విధంగా అంటే మరెవ్వరూ కాయలు కోరకండా వుంటారని వాళ్ళ ఉద్దేశం ..కానయితే గుళ్ళో లింగం సహితం మింగే ప్రబుద్ధులు వుంటారని పాపం వాళ్ళు తలచలేకపోయారు.

తిరిగి పాదు పిందెవేసింది. సుమారు పది పన్నెండు కాయలు ఒక్కసారిగా దిగాయి—పిందెవేసినదినంనుంచీ, మాకో కాయ, మాకో కాయ అని తీర్థప్రజ విధంగా రోజూ ఉపాధ్యాయుల దర్శనంచేస్తూనే ఉన్నారు. ఉపాధ్యాయులుగూడా తామిదివరకు అనుకొన్నప్రకారంగా చెబుతూనే వున్నారు కాని వాళ్ళు వచ్చి అడగటం మాత్రం మానటంలేదు.

కాయలు ముదిరే స్థితివచ్చింది. రేపో మాపో కాయలు కోద్దామనుకొంటున్నారు. ఇదివరకు ఎక్కన విధంగానే తిరిగి కాయలు కోయబోయారిద్దరు ముగ్గురు పెద్దమనుష్యులు. కాని అలా కోయటానికి వీలులేదయ్యా అని ఐకమత్యతతో ప్రతిఘటించటంతోటే... 'అ పెద్దమనుష్యులు తెల్లబోతూ మరెప్పుడు కోస్తారండీ?' అని ప్రశ్నించారు.

'ఎప్పుడు కోసినా—మీరు ప్రయాసపడ నవసరంలేదు. ఇంతముక్కగూడా యిచ్చేది లేదు మీ దొడ్డిలో పాదులుపెట్టుకొని కాయించుకొని తింటూ, పైగా బీదవాళ్ళమైన మా ఆస్తి మీద బయలుదేరుతారేమయ్యా ...అంతగా కాదూ, కూడదూ అంటే ..డబ్బులు యిస్తాం .. కాయలు కొనుక్కోండి' అన్నారు సౌమ్యంగా.

'పోనీలెండి, మిమ్మల్ని మా కోసం బాధపెట్టడం యెందుకూ?' అని పైకి అంటూవాన్న కళ్ళల్లో చురచురలు చూపిస్తూ వెళ్లిపోయారు. చూపిద్దాం మన తడాఖా అనే ఉద్దేశంతో!

వాళ్లను మంచిమార్గంలో పెట్టగలిగాం గదా అని ఉప్పొంగిపోయారుఉపాధ్యాయులు. తమ తీర్మానప్రకారం ముందునడుచుకోటానికి యే విధమైన అభ్యంతరం ఉండనీ, ఒకరు మార్గదర్శకులయితే క్రమంగా జరిగినవాళ్లుకూడా వారినుంచే విషయాలు గ్రహించి నీతి నేర్చుకొంటారనీ తలబోస్తూ ఉన్న కాయలన్నీ మర్నాడు కోసి, తమకు కావలసినవి తాము తీసుకొని, మిగిలినవి (ఒకవేళ మిగిలితే మాత్రం) తమ ఆశ్రితులకు యిచ్చుకొనేటట్టు నిర్ణయం చేసుకొన్నారు.

ఆ వేళ సాయంకాలందాకా, మరో అరడజను ప్రముఖులు ఆనపాకాయ, తమ కవసరమైన విధానం మనవిచేసుకొంటూ ఒక కాయకోరటం జరిపారు. కాని చివరికి జవాబు చెప్పగలిగాం గదా అనే ధైర్యంతో మరి అందరికీ యిదివరకు సిద్ధపరచి వున్న జవాబే చెప్పారు. జవాబు విని వినటంతోటే పళ్లు పటపటలాడిస్తూ, చూడండి, మా తడాఖా అన్నట్టు మీసం దువ్వుతూ, యెవరికి వాళ్లు వెళ్లి పోయారు.

ఈ విధంగా జవాబు చెప్పకలిగి, సంతోషించ కల్గినందుకు, తమను తామే అభినందించుకొంటూ (మరి అభినందించేవారు-చేసిన పనికి మరి లేరుగా) మర్నాడు ప్రొద్దుటే పాఠశాలకు రావటంతోటే ఒక కుఱ్ఱవాడ్ని పాక యెక్కించి, కాయలు కోయించే యేర్పాటుచేసుకొందామని తమలో తామనుకొని యెవరిండ్లకు వాళ్లు వెళ్లిపోయారు.

ఆ రాత్రి, 'ఆనపకాయకూరలు' వివిధరూపాలో (పప్పువేసి, పాలుపోసి, నువ్వుపిండి—పులుసుకండి) తమ ఆహారంతోపాటు భుజించినట్టుగా కలలుకని, కళ్ళుతెరచి, అది కలగా తెల్సుకొని, తెల్లవారిన తర్వాత, అందరుపాధ్యాయులూ పాఠశాలకు వెళ్ళుపోయి, కాయలు వెతుక్కొనేసరికి, అవి లేవు సరిగదా, బరిపాకంతా, మధ్యమధ్య ఆకులు పీకేయబడి, కన్నాలు పెట్టబడి తిరిగి నేతకు సిద్ధంగా వుంది. దొడ్లోకి పోయి—చూస్తే పాదు మొదలంట కోసివుంది. పాపం ఉపాధ్యాయులనోట్లో ఒక ఆనపకాయ గూడా పడలేదు సరిగదా, (పడే ఆశగూడా లేదు మరి) తిరి కొత్తఆకులతో, నేతకు పాకసిద్ధమయి కూర్చుంది.